



# అమెరి'కలకలం' కథలు

## - వంగూరి చిట్టెన్ రాజు



# బాపూ గారూ.......ఈ జన్మకి ఇది చాలు

అప్పుడేమో ఆయనకి 12 ఏళ్ళ వయసు. రమణ గారికి పద్నాలుగుట. రమణగారు "అమ్మ మాట వినకపోతే" అని ఒక కథ వ్రాశారు. బాపు గారు దానికి బొమ్మ వేశారు. ఇద్దరూ కలిసి "బాల" పత్రిక సంపాదకులు విద్వాన్ విశ్వం గారి దగ్గరకి వెళ్ళి "కథ ప్రచురిస్తే, బొమ్మ ఉచితం" అని ఆశ పెట్టారు. ఆయన కథ చదివి, బొమ్మ చూసి "ఇడ్లీ కన్నా పచ్చడే బావుంది" అని ఆ కథ ప్రచురించారు. ఈ విషయాలు అందరికీ తెలిసినవే. కానీ ఎవరికీ తెలియనిది అప్పటికీ నేను పుట్టి మూడు, నాలుగు నెలలు మాత్రమే అయింది. ఆ తరువాత రమణ రాత–బాపు గీతల ద్వారా నలభై ఏళ్ళు వారిద్దరూ సృష్టించిన ఆ అద్భుతమైన వాతావరణంలో పెరిగిన కోటానుకోట్ల మందిలో నేనూ ఒకణ్ణి. అంతవరకూ బాపూ గారిని పరోక్షంగా ఆరాధించడమే కానీ సుమారు ముప్ఫై ఏళ్ళక్రితం ఆయనతో మాట్లాడే అవకాశం మొదటి సారిగా కలిగింది. అది నా జీవితంలోనే కొత్త మలుపు. ఆ తరువాత అంచెలంచెలుగా ఎదిగి “నా జీవితంలో 2006 సంవత్సరం వంగూరి చిట్టెన్ రాజుకి అంకితం” అని బాపు గారు అనేంత స్థాయికి ఎదిగిన మా అనుబంధం కేవలం ఆయనకి నాపట్ల ఉన్న ఆత్మీయతకి, ఆయన సహృదయానికీ నిలువెత్తు నిదర్శనాలే కానీ నాకు అటువంటి అర్హత లేనే లేదు. బాపూ గారి గురించి తెలిసిన చాలా మంది చెప్పినట్లు, ఆయన చాలా, చాలా ప్రైవేటు వ్యక్తి. అందరితోటీ స్నేహంగానే ఉంటారు కానీ తన చుట్టూ ఒక బరి గీసుకుని, అందులోకి అతి కొద్ది మందిని మాత్రమే రానిస్తారు. ఆ అతి కొద్ది మందిలో కలకాలం కాకపోయినా కనీసం కొంతకాలం అయినా నేను కూడా ఒకడిగా చెలామణీ అయ్యాను. ....ఈ జన్మకి ఇది చాలు.

అంతకు ముందే ఉత్తరం వ్రాసినా, 1988 లో నా పూర్వ జన్మ సుకృతం వలన ఒక రోజు బాపు గారిని భయం, భయంగానే ఫోన్ లో అమెరికా నుంచి పిలిచాను. ఎందుకంటే, మా హ్యూస్టన్ లో తలపెట్టిన సప్తమ తానా మహా సభల సావనీర్ "మధుర వాణి" కి నన్ను సంపాదకుడిగా పెద్దలు నియమించారు. అది తెలియగానే నా బుర్రలో వెలిగిన మొట్టమొదటి పేరు బాపు–రమణ. ఆ ఫోన్ ఎత్తి, హలో అన్నది సాక్షాత్తూ బాపూ గారే అని తెలియగానే నాకు ముచ్చెమట్లు పట్టేసి, అనుకోకుండానే కుర్చీలోంచి లేచి నుల్చుని మాట్లాడడం మొదలు పెట్టి "అయ్యా, మాది అమెరికాలో టెక్సస్. ఊరి పేరు హ్యూస్టన్. ఇక్కడ భారీ ఎత్తున మేము తెలుగు సభల జరుపుకుంటున్నాం" అని గబ గబాగా వాగేయగా ఆయన "సభలా? అందులోనూ అమెరికాలోనా? నేను రాను" అని ఫోన్ పెట్టెయ్యబోతుంటే, నేను బుడుగు కంటే ఘోరిగా, "మాకు

అట్ట మీద అద్భుతమైన బొమ్మ కావాలి" అని అరిచాను. ఆ అరుపేదో ముందే అరవచ్చుగా అనకుండా, "ఆ ఏడుపేదో ముందే ఏడవచ్చుగా" అనే ధోరణిలో మాట్లాడకుండా బాపు గారు చల్ల బడ్డారు.

"సరే, బొమ్మ వేస్తాను, ఎలాంటి బొమ్మ కావాలీ?' అని అడిగారు బాపూ గారు. "అంటే, మీకు పండగలూ, గుళ్ళూ గోపురాలూ, దెయ్యాలూ, భూతాలూ కావాలా? చీర కట్టుకున్న లిబర్టీ అమ్మాయి కవరు మీద ఉండాలా?" మొదలైన ప్రశ్నలు అడిగి నా అభిప్రాయాలు తెలుసుకుని, ఎప్పటికి కావాలో కనుక్కున్నారు." అదే అవకాశం కదా అని "సార్, మా మధుర వాణికి రమణ గారి చేత ఏమైనా మంచి ఆర్టికిల్ రాయించి పెట్టగలరా?" అని అడిగాను.

"ఇదిగో, ఆయన్నే అడగండి. మధ్యలో నా రికమండేషన్ ఎందుకూ?" అని బాపూ గారు ఫోన్ రమణ గారికిచ్చారు. నా జన్మలో మొట్ట మొదటి సారిగా బాపు గారి గొంతుక విన్న పది నిముషాలలో "హలో, ఎలా ఉన్నారు?" అని రమణ గారి గొంతుక కూడా వినడం కూడా నా జన్మలో మొట్టమొదటి సారి. వెను వెంటనే ఇంకా భయం, భయంగా, నెర్వస్ గా నేను కుర్చీకూడా ఎక్కేసి ఫోన్ లో మాట్లాడడం కూడా నా జన్మలో మొదటి సారే! నాకు తెలిసీ అమెరికా సావనీర్ల కి బాపు గారు బొమ్మ వెయ్యడం అదే మొదటి సారి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మా హ్యూస్టన్ వారు బాపూ గారు వ్రాసిన "మధుర వాణి" టైటిల్ నే వాడుతున్నారు.

బహుశా 1990 ప్రాంతాలలో నేను ఒకసారి ఇండియా వెళ్ళినప్పుడు నా "పుణ్య క్షేత్రాల యాత్ర" లో భాగంగా మద్రాసులో బాపు గారి ఇంటికి వెళ్ళాను...అరగంట ఆలస్యంగా. అప్పటికే ఆయన పైన వరండాలో వాచీ చూసుకుంటూ పచార్లు చేస్తున్నారు. అది చూసి నేను "సారీ సార్.." అనబోతూ ఉంటే "పరవాలేదు. ఎంతయినా అమెరికా వాళ్ళు టైం విషయంలో మా వెనకాలే కదా" మన టైం డిఫరెన్స్ మీద చమత్కరించి నేను లేటుగా వెళ్ళినందుకు చురక వేశారు. తన ట్రేడ్ మార్క్ నవ్వుతో మమ్మల్ని లోపలికి ఆహ్వానించి సోఫాలో కూచోబెట్టి, బాపు గారు ఫోన్ తీసుకుని డయల్ చేసి "వెంకట్రావ్, ఆయనొచ్చారు" అన్నారు. నేను ఉండబట్ట లేక "ఆయన అంటారేమిటి, నా పేరు మర్చిపోయారా. ఇంతకీ మీరు పిలిచినది ఎవర్నీ?" అని నసిగాను. ఆయన మళ్ళీ తన ట్రేడ్ మార్క్ పద్ధతిలో విశాలంగా నవ్వేసి "చూద్దురు గాని...వెంకట్రావ్ తో మీ గురించి చాలా సేపే మాట్లాడాను. అందుకే ఆయన వచ్చారు అనగానే మీరే అని తెలిసిపోతుంది" అన్నారు. బాపు గారితో మాట్లాడదామని వస్తే, ఈ కోన్ కిస్కాయ్ వెంకట్రావ్ గోల ఏమిటీ" అని నేను వెర్రి మొహం పెడదామని అనుకుంటూ ఉండగానే, మూడు నిముషాలలో సదరు వెంకట్రావ్ గారు "పైనించి దిగి వచ్చారు". ఆయనే ముళ్ళపూడి వెంకట రమణ గారు అని తెలియగానే....నా గుండె మరింత స్పీడుగా కొట్టుకుంది. ఆనందం రెట్టింపు అయింది. ముళ్ళపూడి గారు పై అంతస్థులోనూ, బాపు గారు క్రిందా ఉంటారనీ తెలుసు, దానికి కారణాలూ, "బుల్లెట్" సినిమాలో వారు మోసపోయిన వివరాలూ నాకు తెలుసు కానీ, ముళ్ళపూడి గారిని ప్రత్యక్షంగా చూడడం అదే మొదటి సారి.

ఇక 1996 లో అనుకుంటాను. షికాగో తానా సభలకి బాపు గారు వచ్చారు. ఆ సభలలో ప్రధాన వేదిక మీద నేను వ్రాసిన నాటకం నేను, అనిల్ కుమార్, రత్నపాప, ముత్యాల పద్మశ్రీ వేశాం. మొదటి వరసలో బాపుగారు, జగ్గయ్యగారు కూర్చున్నారు. నాటకం మొదలుపెట్టిన నాలుగు నిముషాలలో "మా బ్రేక్ టైం" అని సౌండ్ టెక్నిషియన్స్ మైకు కట్టేసి వెళ్ళిపోయారు. దాంతో డ్రామా ఘోర పరాజయం పొందింది. బాపూగారు గ్రీన్ రూమ్ లోకి వచ్చి, ఆప్యాయంగా భుజం మీద చెయ్యి వేసి "నాటకం పేలలేదండి" అన్నారు. జగ్గయ్యగారు కూడా ఏదో అనబోతూ ఉంటే, నేను ఏడుపు మొహం పెట్టగానే "పరవా లేదండి. అప్పుడప్పుడు మా సినిమాలూ, అందులో జోకులూ కూడా పేలవండి" అని భరోసా ఇచ్చారు. "అయినా మళ్ళీ, మళ్ళీ తీస్తూనే ఉంటామండి" అని నాటకాలు రాయడం, వెయ్యడం మానకు అని సూచన ఇచ్చారు.

అక్కడి నుంచి బాపుగారిని హ్యూస్టన్ మేము తీసుకొచ్చినప్పుడు మా ఇంట్లోనే వారం రోజులు ఉన్నారు. "మీ ఇల్లు మరీ చిన్నదేమో" అని ఓ మిత్రుడు జోక్ వేస్తే "పరవా లేదండి. రాజు గారి హృదయ వైశాల్యం పెద్దదే" అని సమాధానం చెప్పారు బాపుగారు. వంగూరి



ఫౌండేషన్ ఆఫ్ అమెరికా మొదలు పెట్టి అప్పటికి ఏడాది అయి, మా మొదటి పుస్తకం "అమెరికా తెలుగు కథానిక – మొదటి సంకలనం" ప్రచురించాం. ఆ పుస్తకాన్ని బాపుగారు ఆవిష్కరించారు. ఆ సందర్భంగా తీసుకున్న రెండు ఫోటోలు ఇందుతో జతపరుస్తున్నాను. ఒక విశేషం ఏమిటంటే, ఈ ఫోటోలో కనపడుతున్న మా ఐదేళ్ళ మా అబ్బాయిని పక్కన కూచోబెట్టుకుని, శ్రీ రాముడు బొమ్మ ఎలా వెయ్యాలో వేసి చూపించారు బాపూ గారు. ఆయన చక, చకా ఆ బొమ్మ వేస్తున్నంత మేం అందరం నిశ్చేష్టులమై చూస్తూ మమ్మల్ని మేమే మైమరిచి పోయాం. బాపూగారు బొమ్మ ఎలా వేస్తారో చూడని వారు ఆ నాటి మచ్చు తునక ఈ క్రింది వీడియో చూడవచ్చును. ఈ వీడియో తీసిన అనిల్ కుమార్ కి, యు ట్యూబ్ లో అప్ లోడ్ చేసిన సుధేష్ పిల్లుట్ల కి సర్వదా నేను ధన్యవాదాలు చెప్పుకుంటూనే ఉంటాను. అప్పుడే తను వేసిన ముప్పై తిరుప్పావై రంగుల బొమ్మలు నాకు ఇచ్చి, "ఇవి శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రుల వారి కోరిక మీద, ఆయన రచించిన తెలుగు తిరుప్పావై ముప్పై పాశురాలలో, ప్రతీ ప్రాశురానికీ ఒక్కొక్క వాక్యం స్ఫూర్తిగా ఈ బొమ్మలు వేశాను. అనుకోకుండా ఆయన పోయారు. కానీ ఈ బొమ్మలతో, ఆయన వ్రాసిన తిరుప్పావై మీ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా ప్రచురించగలరా" అని అడిగారు. ఆయన మాట శిరసా వహించి, ఆ "తిరుప్పావై" పుస్తకాన్ని 1998 లో మేము నిర్వహించిన "మొట్ట మొదటి అమెరికా తెలుగు సాహితీ సదస్సు"లో విడుదల చేశాం. కానీ రంగు, రంగుల పుస్తక ప్రచరణలో నాకు కానీ, మా ప్రింటర్స్ కి కానీ అనుభవం లేక, సమయాభావం వలనా ఆ పుస్తకం అంత బాగా రాలేదు. ఆ పుస్తకం కాపీలు బాపుగారికి అందగానే "God Bless you for brining out Tiruppavai. God save the printer & binder" అని ఇ-మెయిల్ ఇచ్చారు. నాకు భలే సిగ్గేసింది. కానీ ఏం చేస్తాం. అదే పుస్తకాన్ని ఆ తరువాత ఇండియాలో మిత్రుడు ఎస్.పి. బాలసుబ్రమణ్యం & ఆశ్రమం వారు కూడా ప్రచురించారు అని విన్నాను.



ఆ తరువాత అడపా, తడపా ఫోన్ లో మాట్లాడుకోవడం, ఇండియా వెళ్ళినప్పుడల్లా కలుసుకోవడం జరిగేది కానీ 2006 లో మా అనుబంధం ఇంకా బలపడింది. ఆ ఏడు నా మొట్టమొదటి పుస్తకం "అమెరికామెడీ కథలు" జూలై లో ప్రచురించాం. ఆ పుస్తకం ప్రచురిద్దాం అని అనుకున్న అరక్షణంలో బాపు గారినీ, రమణ గారినీ ముచ్చటగా మూడు కారణాలకి పిలిచాను. మొదటిది, ఆ పుస్తకం వారిద్దరికీ అంకితం ఇవ్వడానికి వారి అనుమతి

పొందడానికి. రెండోది బాపు గారిని ముఖచిత్రం వెయ్యమని అర్థించడానికి. మూడోది ఆ పుస్తకానికి ముందు మాట వ్రాయమని విన్నవించుకోడానికీ.

ఏ విధమైన ప్రతి ఫలమూ అడక్కుండా, ఆశించకుండా, కేవలం నా మీద అభిమానం కొద్దీ ముళ్ళపూడి రమణ గారు అద్భుతమైన ముందు మాట రాసిచ్చారు. దాన్ని బాపు గారు స్వదస్తూరీతో వ్రాసి పంపించారు. అలాగే బాపు గారు చార్లీ చాప్లిన్ గెటప్ తో నన్ను చిత్రీకరిస్తూ అట్ట మీద బొమ్మ గీసి అధ్భుతంగా గీసి పంపించారు. అంతే కాదు, రచన సాయిగారి దగ్గర నుండి నా ఫోటో తెప్పించుకుని, నా కేరి కేచర్ బొమ్మ కూడా ఉచితంగా వేసి పంపించారు. ఇక్కడొక చిన్న పిట్ట కథ చెప్పాలి. బాపు గారు నా కథల పుస్తకానికి ముఖ చిత్రం వెయ్యడానికి బహుశా రెండేళ్ళ ముందు వారింటికి వెళ్ళినప్పుడు నేను ఒక రంగు రంగుల పువ్వుల చొక్కా వేసుకుని వెళ్ళాను. కింద హాల్లో కాస్సేపు కూచున్నాక "పైకి వెడదాం రండి" అని ఆయన బొమ్మలు వేసే గదిలోకి తీసుకెళ్ళారు. అది చాలా ఆప్తులకే కానీ ఆ గదిలోకి ప్రవేశం ఉండదని ఆ తరువాత నాకు తెలిసింది.. వారి నేల మీద కూచుని బొమ్మలు వేసే గదిలో చాలా సేపు కూచుని కబుర్లు చెప్పుకున్నాం. ఆ గదిలో ఒక మూల గోడ మీద చార్లీ చాప్లిన్ ఒక కాలు విసురుతూ, చేతి కర్రతో, టోపీ తీస్తూ ఉన్న భంగిమలో ఒక క్లాసిక్ ఫోటో ఉంటుంది. అది చూసి చార్లీ చాప్లిన్ మీద ముచ్చటగా, మూడే మాటలు మాట్లాడుకున్నాం. అది జరిగిన కొన్ని సంవత్సరాలకి, బాపూ గారు అదే చార్లీ చాప్లిన్ కి, ఆ నాడు నేను వేసుకున్న అవే రంగులతో ఆ చొక్కాని, తొడిగి, చాప్లిన్ మొహం బదులు నా మొహం వేసేసి, మన ధోవతీ కట్టేసి. నా "అమెరికామెడీ కథలు" పుస్తకానికి కవర్ పేజీ బొమ్మ వేశారు. That is Bapu. గత సంవత్సరం (2013) లో అప్పటి దాకా నేను వ్రాసిన 116 అమెరికామెడీ కథలని అన్నింటినీ ఒక సమగ్ర సంకలనం గా ప్రచురించినప్పుడు మళ్ళీ బాపూ గారే కవర్ పేజీ డిజైన్ చేసి ఇవ్వగా, అదే ముందు మాటతో ప్రచురించుకుని ఆయనకీ ధన్యవాదాలు తెలుపుకున్నాను.

అదే విధంగా, నాకు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి తెచ్చి పెట్టిన "అసలు ప్రశ్న" అనే నాటకం బాపు-రమణలకి వీడియో పంపించాను, కానీ వారు నిజంగా అది చూస్తారని అని నేను అనుకోలేదు. కానీ, మనం అనుకోనివి అప్పుడప్పుడూ జరుగుతూ ఉంటాయి. "మీ నాటకం చాలా నిజాయితీగా ఉంది" అనే వారి అభిప్రాయం అందుకోవడం ఒకటి. ఎందుకంటే ఆ నాటకం చూసిన వేలాది మంది అభిప్రాయం "చాలా హాస్యంగా ఉంది, ఒక అమెరికా సామాజిక సమస్యని తెరమీదకి తెచ్చారు, అందరూ బాగా నటించారూ..." మొదలైన తరహాలో ఉంటే బాపు-రమణల ఈ అభిప్రాయం నన్ను చాలా ఆశ్చర్య పరిచింది. దానికి కారణాలు తరవాత అడిగి తెలుసుకున్నాను అనుకోండి. అది వేరే విషయం. ఆ నాటకంలో అన్ని నిజాయితీ అంశాలు నేను వ్రాసినట్టు నాకే తెలియదు.

ఆ ఏడు..అంటే 2006 అక్టోబర్ లో హ్యూస్టన్ లో జరిగిన "ఐదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు" కు బాపు-రమణ లని ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిద్దామని మా ఆలోచన. ఆ సదస్సు అంశం "సాహిత్యంలో హాస్యం". సభలూ, సత్కారాలూ బొత్తిగా వారికి కిట్టవనీ, ఇది నేను మామూలుగా ఫోన్ లో పిలిస్తే "ఇదేదో అర్రీ బుర్రీ గా తేలే యవ్వారం" కాదు కాబట్టి, స్వయంగా మద్రాసులో వారింటికి వెళ్ళి వారిద్దరినీ "బతిమాలుకుంటే" మా కోరిక తీరే అవకాశం కొంతైనా ఉంటుందనీ, వారింటికి వెళ్ళాను. ఏ కళని ఉన్నారో బాపు గారు "నువ్వు పిలుస్తున్నావు కాబట్టి సరే" అన్నారు. రమణ గారు మటుకు "నేను ప్రయాణాలు చెయ్య లేను. నా మోకాళ్ళు ఎప్పుడూ రిపేర్లో ఉంటాయి. నేను రాలేను" అన్నారు.

ఆ సదస్సులో బాపు గారికి అనుకున్నాట్టుగానే లైఫ్ టైమ్ ఎఛీవ్మెంట్ అవార్డు ఇచ్చాం. అప్పటి 12 సంవత్సరాల చరిత్రలో, ఎవార్డులు ఇచ్చే అలవాటు ఎక్కువగా లేని వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఇచ్చిన మొట్టమొదటి ఎవార్డు అదే! ఈ ఎవార్డు సమయంలో జరిగిన గొప్ప విషయం బాపు గారి స్పందన. బాపు గారు సభలలో ఎప్పుడూ మాట్లాడరు. ఎందుకంటే, తనకి "సభాకంపం, జన గండం" ఉందని సభాముఖంగా ప్రకటించి, "అందాల రాముడు రాజ్బాబు అన్నట్టు నాకు తెలుగే రాదు, సంస్కృతం నిల్లు. అందు చేత నాకేం తోచక ఇద్దరి

తరఫునా –సాహిత్యం అంటే మైత్రి ఉంది కదా ఏదైనా చెబితే రాసుకుని చదువుతాను అని రమణ గారిని అడిగాను" అని ముళ్ళపూడి గారు వ్రాసి ఇచ్చిన ప్రసంగ వ్యాసాన్ని డా. పప్పు వేణుగోపాల రావు చేత చదివించారు. నేను ఎలాగైనా ఆయన చేత మొహమాట పెట్టేసి మాట్లాడించాలని అనుకుని “ఇప్పుడు బాపు గారు రెండు మాటలు మాట్లాడతారు” అని ఆయన కేసి బతిమాలుతూ చూశాను. ఆయన వెంటనే లేచి “రెండు మాటలు” అనేసి కూచున్నారు. జనం అంతా నవ్వ లేక నానా అవస్థా పడ్డారు. అదీ ఆయన హాస్య చతురత.

2006 లోనే నా జీవితంలోనూ, బాపు–రమణల జీవితంలోనూ, ఆ మాటకొస్తే తెలుగు సాహిత్య చరిత్రలోనూ మరొక అపురూపమైన సంఘటన జరిగింది. ఇది ఏ కోశాన్నా అతిశయోక్తి కాదు. నా "అహంభావం" అంతకన్నా కాదు.

ఆ సంవత్సరం ఆఖరి రోజు, (డిశంబర్ 31, 2006), మరియు మరుసటి సంవత్సరం మొదటి రోజు (జనవరి 1, 2007) తేదీలలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు హైదరాబాదులో జరిగింది. ఆ నాడు వారి దంపతుల సమేతంగా జరిగిన, “బాపు–రమణ” ల మైత్రీ షష్టి పూర్తి ఉత్సవాలని “తెలుగు చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం”గా వర్ణిస్తూ సుప్రసిద్ధ సాహిత్య వేత్త సి. మృణాళిని గారి సుమధుర వ్యాఖ్యానం తో ఈటీవీ వారు ప్రసారం చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమం ఈ క్రింది వీడియోలో చూడవచ్చును.

http://koumudi.net/vanguri/psadassu_sum_up.htm

ఆ నాటి సదస్సు పూర్తి అవగానే బాపు గారు నన్ను పక్కకి పిలిచి అన్నమాటే “నా జీవితంలో 2006 వంగూరి చిట్టెన్ రాజుకి అంకితం”. ఎందుకంటే ఆ నలుగురూ..”బాపు–రమణ” దంపతులు ఒకే వేదిక అలంకరించడం అదే మొదటి సారి. నాకు తెలిసీ అదే ఆఖరి సారి.




అంతెందుకూ.....ఆ మధ్యన బాపు కార్టూన్ సంపుటి పుస్తకాలు కొనుక్కుని అమెరికాలో చూస్తూ ఉంటే అనుకోకుండా ఒక పేజీలో బాపుగారు నా పేరు మీద వేసిన ఒక కార్టూన్ కనపడింది. అది ఇందుతో జతపరుస్తున్నాను. నా వంటి సర్వ సాధారణ వ్యక్తి కి అంత ఆత్మీయత చవి చూపించిన కారణ జన్ముడు బాపు గారి అనేకానేక జ్ఞాపకాలతో.... ఈ వ్యాసం అంకితం ఇస్తున్నాను.

ఆఖరి మాటగా...బాపు-రమణల చేతుల మీదుగా శుభారంభంజరిగిన మా ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుల పరంపరలో లండన్ మహా నగరంలో ఈ నెల, సెప్టెంబర్ 27-28, 2014 తారీకులలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా & యుక్త సంస్థల ఆధ్వర్యంలో జరగబోయే “నాలుగవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు” బాపు గారి దివ్య స్మృతికి అంకితం ఇవ్వబడుతుంది. సదస్సు వివరాలకి www.vangurifoundation.blogspot.com చూడండి.

**COMMENTS**